ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 127 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
గురువారం 12 డిసెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# తిరుమల, తిరుపతిలో భారీ వర్షం .. భక్తుల ఇబ్బందులు

**తిరుపతిలో భారీ వర్షం కురిసింది. వర్షానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.**







**తిరుమల, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** తిరుమల, తిరుపతిలో భారీ వర్షం కురిసింది. వర్షానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చలితీవ్రత పెరిగింది. ఘాట్ రోడ్లలో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. పాపవినాశనం, శ్రీవారి పాదాలకు వెళ్లే మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. గోగర్భం, పాపవినాశనం పూర్తిగా నిండి నీరు ఔట్ ఫ్లో అవుతోంది. భారీవర్షానికి తిరుపతి వీధులు జలమయమయ్యాయి. లక్ష్మీపురం కూడలి, గొల్లవానిగుంటలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ప్రవహిస్తోంది. వెస్ట్ చర్చి కూడలిలో రైల్వే అండర్ బ్రిడ్జి వర్షపు నీటితో నిండింది. అధికారులు వాహనాల రాకపోకలను దారి మళ్లించారు. బాలాజీ కాలనీ నుంచి మహిళా వర్సిటీ మీదుగా వాహనాలను మళ్లిస్తున్నారు. తిరుపతిలో మాల్వాడిగుండం జలపాతం పొంగిపొర్లుతోంది. కపిలతీర్థం పుష్కరిణికి వెళ్లకుండా తితిదే భక్తులను నిలిపివేసింది.

# ‘ఉపాధి’ నిధులున్నా బిల్లులు ఎందుకు చెల్లించట్లేదు? : సీఎం చంద్రబాబు ఆగ్రహం

**వచ్చే 3 నెలల్లోగా ప్రతి పింఛన్ ను కలెక్టర్లు పరిశీలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.**



**అమరావతి, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** రానున్న 3 నెలల్లో ప్రతి పింఛన్ను జిల్లా కలెక్టర్లు పరిశీలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. చాలామంది అనర్హులకు పింఛన్లు వెళ్తున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలకు ఆయన ఈ విధంగా స్పందించారు.సచివాలయంలో రెండో రోజు కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని డిమాండ్కు అనుగుణంగా నిర్వహించాలన్నారు. వంద రోజుల పనిదినాలు సరిగా నిర్వహిస్తే మెటీరియల్ కాంపోనెంట్ వస్తుందని చెప్పారు. కానీ పని దినాలు, మెటీరియల్ కాంపోనెంట్ను పూర్తి చేయలేకపోతున్నారని సీఎం అన్నారు.పల్లె పండగలో 14.8 శాతమే పనులు చేశారన్నారు. ఇంకా నెలన్నర సమయమే ఉందని గుర్తుచేశారు. అల్లూరి జిల్లాలో 54 శాతమైతే.. మరో జిల్లాలో 1.6 శాతమే పనులు కావడంపై సీఎం ప్రశ్నించారు. పని పూర్తయ్యాక బిల్లులు ఎందుకు చెల్లించట్లేదని అడిగారు. కలెక్టర్లు ఎందుకు నిర్లిప్తంగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వద్ద ఉపాధి హామీ డబ్బులున్నా బిల్లులు”జలీవన్ మిషన్ ను గత ప్రభుత్వం దెబ్బతీసింది. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం తిరిగి ప్రారంభించాం. కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. తల్లిదండ్రులు చనిపోయిన చిన్నారులుంటే వారికీ పింఛన్ ఇవ్వాలి. సదరం ధ్రువీకరణ పత్రాలను అర్హులకే దక్కేలా చూడాలి. రాజధాని అమరావతి వేగంగా అభివృద్ధి చెందే నగరం. విజయవాడ, గుంటూరు వంటివి అమరావతిలో కలిసిపోతాయి. పట్టణీకరణ పెరుగుతున్న దృష్ట్యా నిరంతరాయంగా ప్రణాళికలుండాలి. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి. స్వచ్ఛాంధ్రలో భాగంగా పచ్చదనాన్ని పెంచేలా చూడాలి. స్వచ్ఛత-శుభ్రత అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. గత ప్రభుత్వం 82 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త వదిలి వెళ్లింది. చెత్త తొలగించే పనులు వేగంగా పూర్తి చేయాలి” అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు

**సినీనటుడు మోహన్ బాబు పై పహాడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.**



హైదరాబాద్, దిల్లీ, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్): సినీనటుడు మోహన్ బాబు పై పహాడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మీడియా ప్రతినిధిపై దాడి ఘటనలో ఆయనపై తొలుత బీఎన్ఎస్ 118(1) సెక్షన్ కింద కేసు నమోదైంది. తాజాగా లీగల్ ఒపీనియన్ తీసుకున్న పోలీసులు.. 109 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు.ఇదీ చదవండి: కుటుంబ సమస్యను శాంతిభద్రతల సమస్యగా మార్చొద్దు: మంచు సోదరులతో సీపీకుటుంబ వివాదం నేపథ్యంలో మంగళవారం జల్పల్లిలోని మోహనాబాబు నివాసానికి మీడియా ప్రతినిధులు వెళ్లారు. ఈ క్రమంలో మోహన్ బాబుతో పాటు వచ్చిన బౌన్సర్లు, సహాయకులు.. గేటు లోపల ఉన్న మీడియా ప్రతినిధులను బయటకు తోసేయడంతో పాటు కర్రలతో దాడిచేశారు. ఓ ఛానల్ ప్రతినిధి చేతిలో నుంచి మోహన్ బాబు మైకు లాక్కుని ముఖంపై కొట్టారు. బౌన్సర్లు నెట్టేయడంతో ఓ ఛానల్ కెమెరామన్ కింద పడ్డాడు. ఈ నేపథ్యంలో కేసు నమోదైంది.

# మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం హైకమాండ్ : భట్టి విక్రమార్క

**తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై హైకమాండే నిర్ణయం తీసుకుంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**దిల్లీ, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై హైకమాండే నిర్ణయం తీసుకుంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై 50 శాతానికి పైగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఢిల్లీలో మీడియాతో ఆయన చిట్చాట్ నిర్వహించారు.”ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు వందశాతం సంతోషంగా ఉంటారనుకోవట్లేదు. ప్రజాస్వామ్యం అంటే ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుంది. హైడ్రాకు పేద, ధనిక అనే తేడా లేదు. తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదు” అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

# వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి నిలబెట్టాం : సీఎం చంద్రబాబు

**‘రాష్ట్రమే ఫస్ట్.. ప్రజలే ఫైనల్ అనే నినాదంతో ముందుకెళ్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు.**




**అమరావతి, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** ‘రాష్ట్రమే ఫస్ట్.. ప్రజలే ఫైనల్’ అనే నినాదంతో ముందుకెళ్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ప్రజల బలమైన కోరికతో ఆవిర్భవించిన ప్రభుత్వ పాలనలో ఆరునెలలు గడిచిందన్నారు. నిర్బంధం, సంక్షోభం, అభద్రతలో గడిచిన ఐదేళ్ల కాలాన్ని ప్రజలు ఒక పీడకలగా భావించి తమ అభివృద్ధి, పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని చెప్పారు. ఈ మేరకు ‘ఎక్స్’లో ఆయన పోస్ట్ చేశారు.”బాధ్యతలు చేపట్టిన తొలి క్షణం నుంచి ప్రజల ఆశలు, ఆకాంక్షలను తీర్చేందుకు నాతో పాటు మంత్రివర్గ సహచరులంతా కృషి చేస్తున్నారు. ఈ ఆరు నెలల్లో గాడి తప్పిన వ్యవస్థల్ని సరిదిద్దాం. వెంటిలేటర్పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి నిలబెట్టాం. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సుపరిపాలనతో వేగవంతమైన నిర్ణయాలతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం. చేయాల్సింది ఎంతో ఉందనే బాధ్యతను గుర్తెరిగి.. ప్రణాళికతో ముందుకువెళ్తున్నాం. మీ ఆశీస్సులు, భాగస్వామ్యంతో.. ‘స్వర్ణాంధ్ర - 2047’ విజన్ ఆంధ్రప్రదేశ్ను నంబర్ 1గా నిలబెడతాం” అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**పబ్లిసిటీ కంటే రియాలిటీకే ప్రాధాన్యం: నారా లోకేశ్**

రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈమేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేశారు. “ఐదేళ్లలో విధ్వంసమైన రాష్ట్రం, అస్తవ్యస్తమైన వ్యవస్థలు, అప్పులు వారసత్వంగా వచ్చాయి. సంక్షోభాలను అవకాశాలుగా, సంక్షేమంగా మలిచే చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచీ రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోంది. పిచ్చిపిచ్చి రంగులు ఉండవు.. మా బొమ్మలు కనిపించవు.. పబ్లిసిటీ కంటే రియాలిటీకే మా ప్రాధాన్యం. రాష్ట్రమే ఫస్ట్... ప్రజలే ఫైనల్ అనే నినాదం కూటమి ప్రభుత్వ విధానంగా అమలు చేస్తున్నాం. ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం” అని లోకేశ్ పేర్కొన్నారు.

# మహిళలకు ప్రతినెలా రూ.2,100 ఆర్థికసాయం : కేజ్రీవాల్ హామీ

**అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహిళలకు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హామీల వర్షం కురిపించారు.**



**దిల్లీ, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజీవాల్ హామీల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా తాము మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు ప్రతి నెలా రూ.2,100 ఆర్థికసాయం చేసా-_మని ప్రకటించారు.’నేను ప్రతి మహిళకు రూ.వెయ్యి ఇస్తానని హామీ ఇచ్చాను. ఈ ప్రతిపాదనకు గురువారం ఉదయం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరో 10-15 రోజుల్లో ఎన్నికల తేదీలు ప్రకటించే అవకాశం ఉంది. కాబట్టి ఇప్పుడు ఈ డబ్బు అభ్యర్థుల ఖాతాల్లో బదిలీ చేయడం సాధ్యం కాదు. మరోవైపు ద్రవ్యోల్బణం కారణంగా ఆ మొత్తం చాలదని పలువురు మహిళలు నా దృష్టికి తీసుకొచ్చారు. అందుకే నెలకు రూ.2,100 ఇవ్వాలని నిర్ణయించాం. అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన దరఖాస్తులు రేపటినుంచి స్వీకరిస్తాం’ అని కేజీవాల్ తెలిపారు.ఇదిలాఉండగా.. ఇటీవల దిల్లీ ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల వరకు లైఫ్ ఇన్సూరెన్స్ ఇస్తామని కేజీవాల్ ప్రకటించారు. దీంతోపాటు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా అందిస్తామని, వారి కుమార్తెల పెళ్లిళ్లకు రూ. లక్ష ఆర్థికసాయం, ఆటోవాలాలకు యూనిఫాం అలవెన్స్ కింద ఏడాదికి రెండుసార్లు రూ.2,500 చొప్పున ఇస్తామని హామీల వర్షం కురిపించారు.

# రైతుకు బేడీలు వేయాల్సిన అవసరం ఏమొచ్చింది? .. సీఎం రేవంత్ సీరియస్

**లగచర్ల దాడి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు ఈర్యానాయక్కు సంగారెడ్డి జైలులో వైద్య పరీక్షల సమయంలో ఛాతీనొప్పి వచ్చింది. జైలు నుంచి ఆస్పత్రికి తరలిస్తుండగా రైతు ఈర్యానాయక్ కు బేడీలు వేసి తీసుకెళ్లిన ఘటనపై సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు**



**దిల్లీ, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజీవాల్ హామీల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా తాము మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు ప్రతి నెలా రూ.2,100 ఆర్థికసాయం చేస్తామని ప్రకటించారు.’నేను ప్రతి మహిళకు రూ.వెయ్యి ఇస్తానని హామీ ఇచ్చాను. ఈ ప్రతిపాదనకు గురువారం ఉదయం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరో 10-15 రోజుల్లో ఎన్నికల తేదీలు ప్రకటించే అవకాశం ఉంది. కాబట్టి ఇప్పుడు ఈ డబ్బు అభ్యర్థుల ఖాతాల్లో బదిలీ చేయడం సాధ్యం కాదు. మరోవైపు ద్రవ్యోల్బణం కారణంగా ఆ మొత్తం చాలదని పలువురు మహిళలు నా దృష్టికి తీసుకొచ్చారు. అందుకే నెలకు రూ.2,100 ఇవ్వాలని నిర్ణయించాం. అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన దరఖాస్తులు రేపటినుంచి స్వీకరిస్తాం’ అని కేజీవాల్ తెలిపారు.ఇదిలాఉండగా.. ఇటీవల దిల్లీ ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల వరకు లైఫ్ ఇన్సూరెన్స్ ఇస్తామని కేజీవాల్ ప్రకటించారు. దీంతోపాటు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా అందిస్తామని, వారి కుమార్తెల పెళ్లిళ్లకు రూ. లక్ష ఆర్థికసాయం, ఆటోవాలాలకు యూనిఫాం అలవెన్స్ కింద ఏడాదికి రెండుసార్లు రూ.2,500 చొప్పున ఇస్తామని హామీల వర్షం కురిపించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# వైకాపాకు భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గుడ్ బై

వైకాపాకు షాక్ ల మీద షాక్ లు తగులుతున్నాయి. ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రకటించారు.



**భీమవరం, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా కు షాక్ ల మీద షాక్ లు తగులుతున్నాయి. ఆ పార్టీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజీనామా చేసిన కాసేపటికే మరొకరు గుడ్బై చెప్పారు. వైకాపాకు రాజీనామా చేసినట్లు భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రకటించారు. వైకాపా ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీ పదవులకు ఆయన గుడ్బై చెప్పారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు జగన్కు పంపారు.

# తిరుపతిలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్వాకం ..అయ్యప్ప భక్తుల అవస్థలు

ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్వాకం భక్తులను ఇక్కట్ల పాల్జేసింది. ఈ ఘటన తిరుపతి లో జరిగింది.



**తిరుపతి, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్వాకం భక్తులను ఇక్కట్ల పాల్జేసింది. ఈ ఘటన తిరుపతి లో జరిగింది. శబరిమల వెళ్లిన అయ్యప్ప భక్తులు తిరుగు ప్రయాణంలో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. దర్శనం ఆలస్యం కావడంతో 35 మంది అయ్యప్ప భక్తులను వదిలేసి బస్సుతో డ్రైవర్ వెళ్లిపోయాడు. దీంతో బాలాజీ లింక్ బస్టాండ్ వద్ద భక్తులు ఇబ్బందులు పడ్డారు.డయల్ 100కు అయ్యప్ప భక్తులు కాల్ చేయడంతో పోలీసులు స్పందించి నెల్లూరు టోల్ గేట్ వద్ద బస్సును ఆపించారు. మరోవైపు అలిపిరి పోలీస్ స్టేషన్లో సదరు ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యంపై అయ్యప్ప భక్తులు ఫిర్యాదు చేశారు.

# దద్దరిల్లిన దండకారణ్యం..

## ఛత్తీస్ గఢ్ లో ఏడుగురు మావోయిస్టులు మృతి

ఛత్తీస్ గఢ్ భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఇందులో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు.



**డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** ఛత్తీస్ గఢ్ దండకారణ్యం మళ్లీ తుపాకుల మోతతో దద్దరిల్లింది. నారాయణ్పూర్ జిల్లాలోని అబూజ్మడ్ అటవీ ప్రాంతంలో భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్కౌంటర్ లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు.యాంటీ నక్సల్ ఆపరేషన్లో భాగంగా ఛత్తీస్గఢ్ ని నారాయణపూర్, దంతెవాడ, జగదల్పూర్, కొండగావ్ జిల్లాల భద్రతా బలగాలు బస్తర్ పరిధిలోని అబూజ్మడ్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. డీఆర్ , ఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో దండకారణ్యంలో కూంబింగ్ చేస్తుండగా భద్రతాబలగాలపైకి మావోయిస్టులు కాల్పులకు దిగారు. దీంతో దళాలు ఎదురుకాల్పులు జరిపాయి.తెల్లవారుజామున 3 గంటల నుంచి ఈ ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు ఏడుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ సంఖ్య పెరిగే అవకాశముంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మావోయిస్టుల కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది.

# రైతుకు బేడీలు వేయాల్సిన అవసరం ఏమొచ్చింది? .. సీఎం రేవంత్ సీరియస్

లగచర్ల దాడి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు ఈర్యానాయక్కు సంగారెడ్డి జైలులో వైద్య పరీక్షల సమయంలో ఛాతీనొప్పి వచ్చింది. జైలు నుంచి ఆస్పత్రికి తరలిస్తుండగా రైతు ఈర్యానాయక్ కు బేడీలు వేసి తీసుకెళ్లిన ఘటనపై సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు



**హైదరాబాద్, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** లగచర్ల దాడి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు ఈర్యానాయక్కు సంగారెడ్డి జైలులో వైద్య పరీక్షల సమయంలో ఛాతీనొప్పి వచ్చింది. జైలు నుంచి ఆస్పత్రికి తరలిస్తుండగా రైతు ఈర్యానాయకు బేడీలు వేసి తీసుకెళ్లిన ఘటనపై సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు. రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడిన సీఎం.. ఘటనపై ఆరా తీశారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు.ఛాతీనొప్పి రావడంతో రైతు ఈర్యానాయక్కు మొదట సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. ఈర్యానాయక్ ఆరోగ్యం నిలకడగా ఉందని.. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు. గతంలోనూ ఛాతీ నొప్పి వచ్చినందున గాంధీకి తరలిస్తున్నామన్నారు.

# రైతులను దగా చేసిన మీకు నిరసన చేపట్టే అర్హత ఉందా? :మంత్రి నాదెండ్ల

రైతుకు ఎవరు అండగా నిలబడ్డారో ఒకసారి చూడండి జగన్ అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.



**అమరావతి, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** రైతుకు ఎవరు అండగా నిలబడ్డారో జగన్ ఒకసారి చూడాలని మంత్రి నాదెండ్లమనోహర్ వ్యాఖ్యానించారు. ధాన్యం కొనుగోళ్లపై జగన్ చేసిన వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా మంత్రి స్పందించారు. "మీ హయాంలో ఈ సమయానికి కేవలం 8.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే సేకరించారు. బాధ్యత కలిగిన మా కూటమి ప్రభుత్వం 15.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. 48 గంటలలోపే డబ్బులు జమ చేస్తున్నాం. జగన్ పాలనలో ఏ రోజైనా రైతులకు సక్రమంగా చెల్లింపులు చేశారా? గోతాలు కూడా సరిపడా ఇవ్వలేకపోయారు. రైతులను దగా చేసిన మీకు నిరసన ర్యాలీలు చేసే అర్హత ఉందా?" అని నాదెండ్ల మనోహర్ నిలదీశారు.

# రాజమహేంద్రవరం టు దిల్లీ డైరెక్ట్ ఫ్లైట్ ప్రారంభం


రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు నుంచి దిల్లీకి నేరుగా విమాన సర్వీస్ ప్రారంభమైంది. అంతకు ముందు దిల్లీ నుంచి రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయానికి మొదటి ఇండిగో డైరెక్ట్ ఫ్లైట్ చేరుకుంది.




**మధురపూడి, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** రాజమహేంద్రవరం ఎయిర్పోర్టు నుంచి దిల్లీకి నేరుగా విమాన సర్వీస్ ప్రారంభమైంది. అంతకు ముందు దిల్లీ నుంచి రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయానికిమొదటి ఇండిగో డైరెక్ట్ ఫ్లైట్ చేరుకుంది. తొలి విమాన సర్వీసులో కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రాజమహేంద్రవరం ఎంపీదగ్గుబాటి పురందేశ్వరి కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ దిల్లీ నుంచి నేరుగారాజమహేంద్రవరం వచ్చారు. రన్వే పై ల్యాండ్ అయిన ఇండిగో ఎయిర్ బసు వాటర్ కెనాల్తోసిబ్బంది స్వాగతం పలికారు. ప్రారంభోత్సవంలో మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఇటీవల రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి ముంబయికి నేరుగావిమాన సర్వీసు ప్రారంభించారు.రాజమహేంద్రవరానికి ఇది మరచిపోలేని రోజు అని ఎంపీ పురందేశ్వరి అన్నారు. జిల్లావాసులకు వివిధ ప్రాంతాలతో అనుసంధానం ఆనందదాయకమని చెప్పారు. భవిష్యత్తులో తిరుపతి, షిర్డీ, అయోధ్య తదితర ప్రాంతాలకు విమాన సర్వీసులు తీసుకువస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. కలసికట్టుగా పనిచేసి రాష్ట్రాభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.దేశంలోని ప్రధాన నగరాలతో రాజమహేంద్రవరం అనుసంధానమైందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇక్కడి నుంచి భవిష్యత్తులో మరిన్ని విమానాలు వెళ్తాయని చెప్పారు. మోదీ ప్రధాని అయ్యాక దేశంలో విమాన సర్వీసులు పెరిగాయని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని చెప్పారు.

# సరస్వతి పవర్లో అసైన్డ్ భూములను వెనక్కి తీసుకున్న ఏపీ ప్రభుత్వం

పల్నాడు జిల్లాలో సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ లోని అసైన్డ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.




**మాచవరం, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** పల్నాడు జిల్లాలో సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ లోని అసైన్డ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. మొత్తం 17.69 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. మాచవరం మండలం వేమవరంలో 13.80 ఎకరాలు, పిన్నెల్లిలో 3.89 ఎకరాలు వెనక్కి తీసుకుంది. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు.

# శ్రీసత్యసాయి జిల్లాలో విద్యుత్ కాంట్రాక్టర్ దారుణ హత్య

విద్యుత్ కాంట్రాక్టర్ దారుణ హత్యకు గురైన ఘటన శ్రీసత్యసాయి జిల్లాలో జరిగింది. కొత్తచెరువు మండలం మైలేపల్లి వద్ద కాంట్రాక్టర్ రాజశేఖర్ తలపై దుండగులు ఇనుపరాడ్లతో కొట్టి చంపారు.



**కొత్తచెరువు, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** విద్యుత్ కాంట్రాక్టర్ దారుణహత్యకు గురైన ఘటన శ్రీసత్యసాయి జిల్లాలో జరిగింది.కొత్తచెరువు మండలం మైలేపల్లి వద్ద కాంట్రాక్టర్ రాజశేఖర్ తలపై దుండగులు ఇనుపరాడ్లతో కొట్టి చంపారు.వివరాల్లోకి వెళితే.. బుధవారం రాత్రి మైలేపల్లి వద్ద ఫాంహౌస్లో రాజశేఖర్ తో పాటు ఇద్దరు సహాయకులు నిద్రించారు. దుండగులకు రాజశేఖర్ చిక్కగా సహాయకులు తప్పించుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వస్తున్నారని తెలిసి రాజశేఖర్ను దుండగులు దూరంగా తీసుకెళ్లి హత్య చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని ఫాంహౌస్ వద్ద పడేసి పరారయ్యారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# వైకాపాకు మరో షాక్ ..మాజీ మంత్రి అవంతి రాజీనామా

వైకాపాకు మరో షాక్ తగిలింది. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ ఆ పార్టీకి రాజీనామా చేశారు.



**విశాఖపట్నం, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపాకు మరో షాక్ తగిలింది. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. విశాఖపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రకటించారు. రాజీనామా లేఖను వైకాపా అధ్యక్షుడు జగన్, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జగన్పై అవంతి పలు విమర్శలు చేశారు."ప్రజలు ఇచ్చిన తీర్పును జగన్ గౌరవించాలి. ఐదేళ్లు పాలించాలని కూటమికి ప్రజలు తీర్పు ఇచ్చారు. కనీసం ఐదు నెలల కూడా సమయం ఇవ్వకుండా ధర్నాలు అంటే ఎలా? వైకాపాలో కార్యకర్తలు నలిగిపోయారు. పార్టీ అంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి. ఐదేళ్లు కార్యకర్తలందరూ ఇబ్బంది పడ్డారు. తాడేపల్లిలో కూర్చుని ఆయన (జగనన్ను ఉద్దేశించి) ఆదేశాలిస్తారు.. కానీ క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఇబ్బంది పడ్డారు" అని అవంతి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

# శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ విద్యార్థి ప్రవీణ్ నాయక్ ఆత్మహత్య చేసుకున్నాడు.



**శ్రీకాకుళం, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ విద్యార్థి ప్రవీణ్ నాయక్ ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి అతడు హాస్టల్ భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్రగాయాలు కావడంతో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రవీణ్ నాయక్ మృతి చెందాడు. మృతుడిని ప్రకాశం జిల్లా వాసిగా గుర్తించారు.


# ఏసీబీ కస్టడీకి నిఖేశ్ కుమార్ ..నాంపల్లి కార్యాలయానికి తరలింపు



**హైదరాబాద్, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన నీటి పారుదల శాఖ ఏఈఈ నిఖేశ్ కుమార్ ను ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. ఆయన్ను చంచల్గూడ జైలు నుంచి నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఏసీబీ అధికారులు నాలుగు రోజుల పాటు విచారించనున్నారు. ఆయన సమక్షంలో బ్యాంకు లాకర్లు తెరవనున్నారు. ఇప్పటికే నిఖేశ్ కుమార్ బినామీ ఆస్తుల వివరాలను అధికారులు సేకరించారు. అతడి స్నేహితుల బ్యాంక్ లాకర్ ఓపెన్ చేసి భారీగా బంగారంతో పాటు కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

# రెండు రోజుల పోలీసు కస్టడీకి వర్రా రవీందర్రెడ్డి

వైకాపా సామాజిక కార్యకర్త వర్రా రవీందర్రెడ్డికి రెండు రోజుల పోలీసు కస్టడీ విధించారు.



**కడప, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా సామాజిక కార్యకర్త వర్రా రవీందర్రెడ్డికి న్యాయస్థానం రెండు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పులివెందుల పోలీసులు కడప కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో శుక్ర, శనివారాల్లో పోలీసు కస్టడీకి అనుమతిస్తూ కడప కోర్టు ఆదేశాలు ఇచ్చింది. వర్రా రవీందర్రెడ్డిని న్యాయవాది సమక్షంలోనే విచారించాలని సూచించింది.ప్రస్తుతం వర్రా రవీందర్రెడ్డి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పులివెందుల పోలీసులు ఆయన్ను కస్టడీకి తీసుకోనున్నారు. సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ , మంత్రులు లోకేశ్ అనిత, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జగన్ తల్లి విజయమ్మ, మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె సునీతపై సోషల్ మీడియాలో అత్యంత హేయంగా, జుగుప్సాకరంగా రవీందర్రెడ్డి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టాడు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్ తో పాటు పలుచోట్ల కేసులు నమోదయ్యాయి.

# రోడ్డుపై బైఠాయించిన రైతులు

పట్టా భూముల్లో పండించిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తాం అని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహించి రోడ్డుపై రైతులు బైటాయించారు.



**అశ్వరావుపేట, డిసెంబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** నారాయణపురం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు.పట్టాలు లేకుండా ప్రభుత్వ, శివాయి భూముల్లో పండించిన ధాన్యాన్ని కేంద్రానికి రైతులు కేంద్రానికి తీసుకునివచ్చారు. పట్టా భూముల్లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పటంతో రైతుల ఆగ్రహించారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మండల వ్యవసాయ శాఖ అధికారి అన్ని భూముల్లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పటంతో రైతులు ఆందోళన విరమించారు.

ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం



# ధనుష్ తో వివాదం ..నేనెందుకు భయపడాలి: నయనతార

రిపబ్లిక్ సినిమా CINEMA

'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్ డాక్యుమెంటరీ విషయంలో నటి నయనతార, నటుడు ధనుష్ ల మధ్య ఇటీవల వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా నయనతార క్లారిటీ ఇచ్చారు.



'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్ డాక్యుమెంటరీ విషయంలో నటి నయనతార, నటుడు ధనుష్ల మధ్య ఇటీవల వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ధనుష్ తీరును తప్పుబడుతూ నయన్ ఒక బహిరంగ లేఖ కూడా విడుదల చేశారు. దీనిపై తాజాగా నయనతార క్లారిటీ ఇచ్చారు. ఆమె అలా చేయడానికి గల కారణాన్ని బయట పెట్టారు. డాక్యుమెంటరీ విషయంలో ఏం జరిగిందో చెప్పారు.తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెను.. 'ధనుష్ గురించి లేఖ రిలీజ్ చేసేంత ధైర్యం ఎక్కడినుంచి వచ్చింది?' అని విలేకరి ప్రశ్నించగా.. "న్యాయమని నమ్మిన దాన్ని బయటపెట్టడానికి నేను ఎందుకు భయపడాలి? తప్పు చేస్తే భయపడాలి. పబ్లిసిటీ కోసం ఎదుటి వ్యక్తుల పేరు ప్రతిష్ఠలను దెబ్బతీసే మనిషిని కాదు నేను. నా డాక్యుమెంటరీ ఫిల్మ్ పబ్లిసిటీ కోసమే మేము ఇదంతా చేశానని చాలామంది మాట్లాడుకుంటున్నారు. అందులో నిజం లేదు. వీడియో క్లిప్కు సంబంధించిన ఎన్వోసీ కోసం ధనుష్ను సంప్రదించడానికి ఎంతో ప్రయత్నించాం. విఘ్నేశ్ కాల్స్ చేశాడు. నేను ఫోన్స్ చేశా. కామన్ ఫ్రెండ్స్ కూడా ఫోన్స్ చేశారు. ఎంత ప్రయత్నించినా మాకు ఎన్వోసీ రాలేదు. సినిమాలో ఉపయోగించిన నాలుగు లైన్ల డైలాగ్ మా డాక్యుమెంటరీ ఫిల్మ్ ఉపయోగించాలనుకున్నాం. ఆ మాటలు మా జీవితానికి ఎంతో ముఖ్యమనుకున్నాం. ఈ విషయంపై ఆయన మేనేజర్ను కూడా సంప్రదించా.ధనుష్ ఒక్కసారి మాట్లాడాలనుకుంటున్నానని చెప్పా. ఆయనకు నాపై ఎందుకు కోపం వచ్చింది? ఆయన మమ్మల్ని ఎందుకు ద్వేషిస్తున్నారు? పక్కవాళ్లు చెప్పిన మాటలు ఏమైనా వింటున్నారా? ఇలాంటి విషయాలు క్లియర్ చేసుకోవడానికి ఆయనతో ఒక్కసారి మాట్లాడాలనుకున్నా. కాకపోతే అది జరగలేదు. ముందు నుంచి మేమిద్దరం ఏమీ శత్రువులం కాదు. ఆయన నాకు మంచి మిత్రుడు. కాకపోతే ఈ పదేళ్లలో ఏం జరిగిందో నాకు తెలియదు" అని ఆమె తెలిపారు. అనంతరం 'జవాన్'లో యాక్ట్ చేయడంపై మాట్లాడారు. షారుక్ కోసమే తాను ఆ సినిమాలో భాగమయ్యానని అన్నారు. షూట్ సమయంలో ఆయన తనకెంతో సాయం చేశారని చెప్పారు. తాను నటించిన ప్రతి సినిమా విజయం సాధించడానికి కారణం అభిమానులేనని అన్నారు. స్టార్ హీరోల అభిమానులు కూడా తనని ప్రేమిస్తుంటారని.. అందుకే తన చిత్రాలు విశేష ఆదరణ సొంతం చేసుకుంటున్నాయని తెలిపారు.నయనతార జీవితాన్ని ఆధారంగా చేసుకొని రూపుదిద్దుకున్న డాక్యుమెంటరీ ఫిల్మ్ 'నయనతార బియాండ్ ది ఫెయిరీ టేల్. తన పర్మిషన్ తీసుకోకుండా ఇందులో 'నానుమ్ రౌడీ దాన్' ఫుటేజ్ను ఉపయోగించారని ఆరోపిస్తూ చిత్ర నిర్మాత, నటుడు ధనుష్ లీగల్ నోటీసులు పంపించారు. మూడు సెకన్ల క్లిప్నకు రూ.10 కోట్లు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే నయనతార ధనుష్ క్యారెక్టర్ను తప్పుబట్టారు. తనపై ఆయన ద్వేషం కనబరుస్తున్నారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.లీగల్ నోటీసులు పంపించినప్పటికీ డాక్యుమెంటరీలో ఆ సన్నివేశాలు ఉపయోగించడంపై ధనుష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నయన్ దంపతులపై కోర్టులో దావా వేశారు.

## ఈ విషయాన్ని సెన్సేషన్ చేయొద్దు :మంచు విష్ణు


నటుడు మంచు విష్ణు తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించారు. తన కుటుంబంలో జరుగుతోన్న వివాదం గురించి మాట్లాడారు.



నటుడు మంచు విష్ణు తాజాగా ప్రెస్ మీట్ పెట్టారు. "మాది ఉమ్మడి కుటుంబం. వేము కలిసిమెలిసి ఉంటామని అనుకున్నా. దురదృష్టవశాత్తూ ఇలా జరిగింది. మేము మళ్లీ తిరిగి కలుస్తామని ఆశిస్తున్నా. ప్రతీ కుటుంబంలోనూ ఇలాంటి గొడవలు ఉంటాయి. కాబట్టి, ఈ విషయాన్ని సెన్సేషన్ చేయొద్దు. ఇది నా రిక్వెస్ట్. ప్రజల్లో మాకు గుర్తింపు ఉంది. ప్రజల్లోకి తీసుకువెళ్లడం కరెక్టే కానీ కొంతమంది హద్దులు మీరి వ్యవహరిస్తున్నారు. ఈరోజు అమ్మ ఆస్పత్రిలో చేరారు. ఇంటికి పెద్ద కుమారుడిగా నేను చాలా బాధపడుతున్నా. నిన్న జరిగిన ఘర్షణలో నాన్నకు గాయాలయ్యాయి. కన్నప్ప సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కోసం లాస్ఏంజెల్స్ ఉన్నప్పుడు ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని నాకు ఫోన్ వచ్చింది. అన్నీ అక్కడే వదిలేసి వచ్చేశాను. అన్నింటికంటే కుటుంబం ముఖ్యం. నిన్న ఉదయాన్నే వచ్చాను. ఏం జరుగుతుందో అర్థంకాలేదు. నేను ఊరులో లేని నాలుగు రోజుల్లో ఇది అంతా జరిగింది. నిన్న జరిగిన గొడవలో ఒక రిపోర్టర్కు గాయాలయ్యాయి. అది దురదృష్టకరం. ఉద్దేశపూర్వకంగా మేము ఎవరినీ బాధపెట్టాలనుకోలేదు" అని విష్ణు

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1884: తెలుగు భాషాభిమాని సి.పి.బ్రౌన్ మరణం (జ.1798).
- 1890: భారత స్వాతంత్ర్య సమరయోధుడు కె.వి.రంగారెడ్డి జననం (మ.1970).
- 1905: భారతీయ ఆంగ్ల రచయిత ముల్క్ రాజ్ ఆనంద్ జననం (మ.2004).
- 1928: భారత స్వాతంత్ర్య సమరయోధుడు కానేటి మోహనరావు జననం (మ.2014).
- 1931: అలనాటి తెలుగు సినీ కథానాయిక షావుకారు జానకి జననం.
- 1950: భారతీయ సినీ కథానాయకుడు రజినీకాంత్ జననం. (చిత్రంలో)
- 1971: ప్రముఖ రంగస్థల నటుడు పెమ్మరాజు రామారావు మరణం.
- 1981: భారత దేశపు క్రికెట్ క్రీడాకారుడు యువరాజ్ సింగ్ జననం



సి.పి.బ్రౌన్



కె.వి.రంగారెడ్డి




ముల్క్ రాజ్ ఆనంద్



షావుకారు జానకి



రజినీకాంత్



పెమ్మరాజు రామారావు



యువరాజ్ సింగ్

## ఓటీటీలోకి 'జీబ్రా'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే..?

సత్యదేవ్, ధనుంజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జీబ్రా' . ఇటీవల విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ అందుకుంది. త్వరలో ఇది ఓటీటీ స్ట్రీమింగ్ కు రానుంది.




సత్యదేవ్, ధనుంజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జీబ్రా' . ప్రియాభవానీ శంకర్ కథానాయిక. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ గా ఇది తెరకెక్కింది. నవంబర్ 22న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ స్ట్రీమింగ్కు రానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆహా ఓటీటీ ప్లాట్ఫామ్ తాజాగా ఓ పోస్ట్ పెట్టింది. తమ ప్లాట్ఫామ్ వేదికగా త్వరలో ఇది స్ట్రీమింగ్ కానుందని చెప్పింది. అయితే, అది ఎప్పుడు? అనేది మాత్రం చెప్పలేదు.కథేంటంటే: సూర్య (సత్యదేవ్) ఓ ప్రైవేట్ బ్యాంక్లో రిలేషన్ షిప్ మేనేజర్. సొంతంగా ఇల్లు కొనుక్కొని.. తాను ప్రేమించిన అమ్మాయి, సహోద్యోగి స్వాతి (ప్రియా భవానీ శంకర్)ని పెళ్లి చేసుకోవాలన్న లక్ష్యంతో జీవిస్తుంటాడు. ఒకరోజు స్వాతి చేసిన చిన్న పొరపాటు వల్ల ఒక వ్యక్తి ఖాతాలో జమ కావాల్సిన చెక్.. మరో వ్యక్తి ఖాతాలో జమవుతుంది. దీంతో డబ్బు పోగొట్టుకున్న ఆ కస్టమర్ తన డబ్బు వెంటనే ఇప్పించాలని పట్టుబడతాడు. ఈ సమస్య గురించి తెలుసుకున్న సూర్య బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాల్ని అడ్డం పెట్టుకొని అప్పటికప్పుడు ఆ డబ్బును ఆ కస్టమర్కు తిరిగిచ్చేస్తాడు. కానీ, అంతలోనే సూర్య పేరుతో ఉన్న మరో బ్యాంక్ ఖాతాలో రూ.5 కోట్లు జమవుతాయి. ఆ తర్వాత ఆ అకౌంట్ ఫ్రీజ్ అయిపోతుంది. కట్ చేస్తే.. తన ఖాతాలో జమ అయిన రూ.5 కోట్లు తనవేనంటూ గ్యాంగ్స్టర్ ఆది (డాలీ ధనంజయ), సూర్య జీవితంలోకి ప్రవేశిస్తాడు. తన డబ్బును నాలుగు రోజుల్లో తిరిగివ్వకపోతే సూర్య తల్లిని చంపేస్తానని డెడ్లైన్ పెడతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? తన ప్రమేయం లేకుండా సూర్య పేరు మీద నకిలీ బ్యాంక్ ఖాతా తెరిచిందెవరు? అందులోకి ఆది డబ్బు ఎవరు జమ చేశారు? ఇచ్చిన గడువులోపు సూర్య. ఆదికి డబ్బులు తిరిగిచ్చాడా? లేదా? ఈ ప్రయాణంలో తనకెదురైన సవాళ్లేంటి? అన్నదే కథ.

## నా ప్రియ మిత్రుడికి హ్యాపీ బర్త్డే ..రజనీకాంత్కు చంద్రబాబు

ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ కు ఏపీ సీఎం చంద్రబాబు బర్త్డే విషెస్ తెలిపారు.



ప్రముఖ సినీనటుడు రజనీకాంత్కు ఏపీ సీఎం చంద్రబాబు బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్లో పోస్ట్ చేశారు. "నా ప్రియ మిత్రుడు, లెజెండరీ సూపర్ స్టార్ రజనీకాంత్కు జన్మదిన శుభాకాంక్షలు. ఆయన ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలి. భవిష్యత్తులో మరిన్ని విజయాలు కొనసాగించాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ఇలాంటి నాయకుడిని ఎప్పుడూ చూడలేదు.. ధోనీపై ఐపీఎల్ ఫ్రాంచైజీ యజమాని ప్రశంసలు

లఖ్నవూ సూపర్ జెయింట్స్ యజమాని సంజీవ్ గోయెంకా ధోనీపై ప్రశంసలు కురిపించాడు.



ఎంఎస్ ధోనీ కి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అంతర్జాతీయ క్రికెట్కు గుడ్బై చెప్పి కేవలం ఐపీఎల్లో మాత్రమే ఆడుతున్న ధోనీ ఫ్యాన్బేస్ ఏమాత్రం తగ్గలేదు. ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్తోపాటు మిగతా జట్ల అభిమానులు కూడా ధోనీని ఇష్టపడుతుంటారు. ఐపీఎల్ యజమానులు కూడా మిస్టర్ కూల్ను గౌరవిస్తారు. అందుకు ఓ ఉదాహరణ లఖ్నవూ సూపర్ జెయింట్స్ యజమాని సంజీవ్ గోయెంకా ఇటీవల ఓ పాడ్కాస్ట్లో పాల్గొన్న ఆయన ధోనీపై ప్రశంసలు కురిపించాడు. అతనితో మాట్లాడిన ప్రతిసారీ ఏదోఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటానని చెప్పాడు. తన మనవడి, ధోనీల మధ్య సంభాషణ గురించి కూడా లఖ్నవూ యజమాని వివరించాడు.'ఎంఎస్ ధోనీ లాంటి నాయకుడిని నేను ఎప్పుడూ చూడలేదు. అతని ఆలోచనా విధానం, ప్రవర్తించే తీరు తన వయసులో ఉన్న వ్యక్తి తనను తాను ఎలా ఆవిష్కరించుకోగలడో తెలియజేస్తుంది. మతీశా పతిరన లాంటి యువ బౌలర్ను డేంజరస్ మ్యాచ్ విన్నర్గా తీర్చిదిద్దాడు. తన ఆటగాళ్లను ఎప్పుడు, ఎలా ఉపయోగించుకోవాలో అతనికి తెలుసు. నేను ధోనీతో సంభాషించినప్పుడల్లా ఏదోఒక కొత్త విషయం నేర్చుకుంటా. నా మనవడికి క్రికెట్ అంటే పిచ్చి. ఒకసారి ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ధోనీతో మాట్లాడా. అప్పుడు నా మనవడు కూడా నావెంట ఉన్నాడు. వాడు ధోనీని అనేక ప్రశ్నలు అడగాడు. 'ఇక చాలు' అని నా మనవడికి చెబితే.. ఉండండి నేను ఈ సంభాషణను ఆస్వాదిస్తున్నానని ధోనీ చెప్పాడు' అని సంజీవ్ గోయెంకా గుర్తు చేసుకున్నాడు. ఐపీఎల్ 2025 సీజన్కు ముందు ధోనీని సీఎస్కే రూ.4 కోట్లకు అన్క్యాప్డ్ ప్లేయర్ రిటైన్ చేసుకున్న సంగతి తెలిసిందే.

## ఆరోగ్యం



# స్వీట్స్ ఎక్కువగా తింటే వచ్చే సమస్యలివే ..ఏం చేయాలంటే

మనలో ఒక్కొక్కరికీ ఒక్కో ఇష్టం ఉంటుంది. కొంతమందికి స్పైసీగా తినడం ఇష్టమైతే.. మరికొంతమందికి స్వీట్గా తినడం ఇష్టం. స్వీట్స్, బేకరీ ఫుడ్స్, పంచదారతో తయారైన స్వీట్స్ ఇలా ఏవి తేడా లేకుండా తినడానికి ఇష్టపడతారు. భోజనం తర్వాత వారికి స్వీట్స్ తినాలనే కోరిక పెరుగుతుంది.అయితే, స్వీట్స్ మాత్రమే కాదు.. మనం హెల్దీ అని తినే కొన్ని ఫుడ్స్ కూడా స్వీట్స్ తినడం వల్ల కలిగే నష్టాలనే తీసుకొస్తుంది. సాస్, పీనట్ బటర్ వంటివి. ఇవి మనకి హెల్దీగా అనిపించినప్పటికీ వాటి తయారీలో ఎక్కువగా పంచదారని వాడతారు. ఇవే కాకుండా కూల్ డ్రింక్స్, క్యాండీస్, బేకరీ ఫుడ్స్, బ్రెడ్స్, ప్రోటీన్ బార్స్ ఇలా చాలా ఫుడ్స్లో పంచదార కలుస్తుంది దీంతో మనకి తెలియకుండా తినే ఈ ఫుడ్స్తో కూడా చాలా సమస్యలు వస్తాయి. అసలు పంచదార ఎక్కువగా ఉన్న ఫుడ్స్ తినడం శారీరక, మానసిక సమస్యలు వస్తాయి. అవేంటో తెలుసుకోండి.

### దంత సమస్యలు..



పంచదార ఎక్కువగా కలిసిన ఫుడ్స్ తినడం వల్ల ముందుగా దంత సమస్యలు వస్తాయి. మన నోటిలో కొన్ని ఆరోగ్యకరమైన, నష్టం కలిగించే బ్యాక్టీరియ ఉంటుంది. మనం పంచదార తీసుకున్నప్పుడు హానికరమైన బ్యాక్టీరియాకి పంచదార అతుక్కుంటుంది. దీంతో మన నోటిలో పాచి ఏర్పడుతుంది. ఈ బ్యాక్టీరియా కొన్ని యాసిడ్స్ని ఏర్పరిచి ఎనామిల్, దంతాలని కవర్ చేస్తుంది. దీంతో దంత సమస్యలు వస్తాయి. పళ్ళు పుచ్చిపోవడం, విరిగిపోవడం, ఇతర దంత సమస్యలొస్తాయి.

### బరువు పెరగడం..




పంచదార తినడం వల్ల కేలరీలు పెరుగుతాయి. పోషకాలు తగ్గుతాయి. షుగర్ ప్రోడక్ట్స్లో ముఖ్యంగా కూల్డ్రింక్స్ తాగినప్పుడు కడుపు నిండుగా అనిపించదు. బ్లడ్ షుగర్ స్పైక్స్, వాటి నుండి క్రాష్లు మీకు ఆకలిని పెంచుతాయి. దీంతో ఎక్కువగా తింటారు. ఎక్కువగా తినడం వల్ల బరువు పెరుగుతారు.

### బ్రెయిన్ ప్రాబ్లమ్స్..




మనం పంచదార ఎక్కువగా ఉన్న ఫుడ్స్ తినడం వల్ల బ్రెయిన్ పనితీరు తగ్గుతుంది. అల్జీమర్స్, డిమెన్షియా వంటి సమస్యలు వస్తాయి. అధ్యాయనాల ప్రకారం సంతృప్త కొవ్వు, చక్కెర ఎక్కువగా తినడం వల్ల వయసుతో సంబంధం లేకుండా జ్ఞాపకశక్తి తగ్గడం, బ్రెయిన్ షార్ప్గా పనిచేయకపోవడం లాంటివి జరుగుతాయి. అంతేకాకుండా కొన్ని ప్రతిస్పందనలు కూడా నియంత్రించబడతాయి. కాబట్టి, పంచదారని తగ్గించడం మంచిది.

### ప్రమాదకర సమస్యలు..



మనం ఎక్కువగా పంచదార ఉన్న ఫుడ్స్ తినడం వల్ల ఆక్సీకరణ ప్రక్రియ స్పీడ్ అప్ అవుతుంది. ఆ ఒత్తిడి మన కణాలపై పడుతుంది. ఇది బాడీలోని ప్రోటీన్స్, టిష్యూస్, అవయవాలను దెబ్బతీస్తాయి. దీంతో మనకి బ్రెయిన్ ప్రాబ్లమ్స్, షుగర్, గుండె సమస్యలు, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్, కొన్ని క్యాన్సర్స్ వచ్చే అవకాశం ఉంది.

### బ్లడ్ షుగర్..




మనం తీసుకునే షుగర్ ఫుడ్స్లో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. సోడా, కుకీస్, కేక్స్, పైస్ ఇలా అన్నింటిలోనూ ఎక్కువగా రిఫైండ్ కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. ఇవి తినగానే మనకి కాస్త ఎనర్జీగా అనిపించినప్పటికీ ఎక్కువగా తినడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ పెరుగుతాయి. కాబట్టి, వీటి బదులు మనం తాజా బెర్రీలు, తాజా కూరగాయల్, గ్రీక్ యోగర్ట్, ప్రోటీన్ రిచ్ స్నాక్స్ని తీసుకోవచ్చు. దీని వల్ల ప్రోటీన్ బ్లడ్లోని షుగర్ని బ్యాలెన్స్ చేసి ఎక్కువసేపు కడుపు నిండుగా అనిపించేలా చేస్తుంది

### చిన్న వయసులోనే పెద్దవారిలా..



మనం ఎక్కువగా షుగర్ ఫుడ్స తీసుకోవడం వల్ల కొల్లాజెన్ రిపేర్కి నష్టం జరుగుతుంది. కొల్లాజెన్ అనేది చర్మాన్ని అందంగా కనిపించేలా చేసే ప్రోటీన్, కొల్లాజెన్ లేకపోవడం వల్ల చర్మం పలుచగా మారి ముసలివారిలా కనిపించేలా చేస్తుంది. దీంతో ముడతలు కూడా ఏర్పడతాయి. ఇన్ని సమస్యల్ని తీసుకొచ్చే స్వీట్స్ తినే బదులు మీరు మీ స్వీట్ క్రేవింగ్స్ని కంట్రోల్ చేసుకునేందుకు పండ్లని తినడం మంచిది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. అందాన్ని కూడా పెంచుతాయి.

గమనిక:ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.